నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, బుధవారం 27 మార్చి 2024 | NALGONDA

## కోదాడ కోర్టులో షార్ట్ సర్క్యూట్



కాలిన పత్రాలను పరిశీలిస్తున్న జడ్జి భవ్య, సీఐ రాము, విద్యుత్ శాఖ పట్టణ ఏఈ శ్రీనివాస్‌రావు

కోదాడటౌన్, మార్చి 26 : కోదాడ కోర్టులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. కోర్టు బయట ఉన్న బీరువా లోని ప్లాస్టిక్ ట్రే పూర్తిగా కాలిపోయింది. దాంట్లో ఉన్న కోర్టుకు సంబంధించిన వివిధ పత్రాలు కాలిపోయాయి. విద్యుత్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ కారణంగా బోర్డుకు ఆనుకునే బీరువా ఉండడంతో దానికి మంట అంటుకొని, లోపల ఉన్న ట్రే వేడికి కాలిపోయింది. ప్రమాదం జరిగిన తీరును ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్యాం సుందర్, పట్టణ సీఐ రాము, ఏఈ శ్రీనివాస్‌రావు పరిశీలించారు. కోర్టుకు మూడు రోజులు సెలవులు కావడంతో మంగళవారం కోర్టు సిబ్బంది ఈ ఘటనను గమనించింది.



మాజీ ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, బొల్లం మల్లయ్య యాదవ్‌లను కలిసిన నల్లగొండ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

# ఇక దూకుడుగా బీఆర్‌ఎస్

### ఓ వైపు రైతులకు అండ..
### మరోవైపు ఎన్నికలకు సిద్ధం






- క్షేత్రస్థాయిలో జనంలోకి దూసుకెళ్లనున్న గులాబీ దళం
- ఈ నెల 30న లేదా ఏప్రిల్ ఒకటిన జిల్లాలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పర్యటన !
- పంట నష్టపోయిన రైతులకు భరోసా
- మరోవైపు పార్లమెంట్ పరిధిలో బీఆర్‌ఎస్ సమన్వయ సమావేశాలు
- ఎంపీ అభ్యర్థితో అసెంబ్లీల వారీగా భేటీకి కార్యాచరణ
- ఈ నెలాఖరులోగా పూర్తి చేసేలా సన్నాహాలు

కారు పార్టీ మరింత స్పీడ్ పెంచనున్నది. ద్విముఖ వ్యూహంతో బీఆర్‌ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలోకి దూసుకెళ్లనున్నది. ఓ వైపు రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ అన్నదాతకు అండగా నిలుస్తూనే.. మరో వైపు పార్లమెంట్ ఎన్నికలపై జోరు పెంచనున్నది. ఈ నెలాఖరు లేదా వచ్చే నెలలో జిల్లాలో గులాబీ అధినేత కేసీఆర్ పర్యటించనున్నారు. ఎండిన పంటలతో నష్టపోయిన రైతులకు భరోసా ఇచ్చేలా టూర్ ఉండనున్నది. అదే విధంగా పార్లమెంట్ పరిధిలో బీఆర్‌ఎస్ సమన్వయ సమావేశాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించారు. ఈ నెలాఖరులోగా భేటీలను పూర్తి చేసేలా సన్నాహాలు చేస్తున్నారు.

– యాదాద్రి భువనగిరి, మార్చి 26 (నమస్తే తెలంగాణ)

### కేసీఆర్ టూర్ ఇలా..

జిల్లాలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఈ నెల 30న లేదా వచ్చే నెల ఒకటిన పర్యటించే అవకాశాలు ఉన్నాయి. అంతకుముందే టూర్ అనుకున్నప్పటికీ వివిధ కారణాలతో వాయిదా పడినట్లు తెలిసింది. ఒకే దఫాలో మూడు జిల్లాలు కవర్ చేసే చాన్స్ ఉంది. రోడ్ షోలు చేసే అవకాశం ఉంది. జిల్లాలో భువనగిరితోపాటు ఆలేరులోని కొన్ని ప్రాంతాలను కవర్ చేయనున్నట్లు తెలిసింది. మొదటగా పంట నష్టపోయిన పొలాల వద్దకు వెళ్లి పరామర్శించాలని భావించినా, కొన్ని కారణాల రీత్యా రోడ్ షోను ఖరారు చేసినట్లు సమాచారం.

### రైతుల్లో భరోసా నింపేలా..

ఎండిపోయిన పంటలతో నష్టాల పాలైన రైతుల్లో ధైర్యం నింపేలా కేసీఆర్ పర్యటన ఉండనుంది. రాష్ట్ర ప్రభుత్వం రైతులను పట్టించుకోకుండా చేస్తున్న అన్యాయాన్ని ప్రజలకు వివరించనున్నారు. జిల్లాలో 2,93,232 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. కానీ వివిధ కారణాలతో పంట పొలాలకు సరిపడా నీరు అందడంలేదు. ప్రభుత్వం సైతం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి పెట్ట లేదు. జిల్లాలో సుమారు 10వేల ఎకరాల్లో వరి ఎండిపోయింది. దీంతో ఎండిన గడ్డి జీవాలకు మేతకు తప్ప దేనికీ పనికిరాకుండా పోయాయి. దాంతో అన్నదాత లబోదిబోమంటున్నారు. రైతులకు జరిగిన నష్టంపై కేసీఆర్ ప్రసంగించడంతోపాటు తమ పదేండ్ల కాలంలో రైతుల కోసం అమలు చేసిన పథకాలు, కార్యక్రమాలను విశదీకరించనున్నారు. పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేసే అవకాశాలు ఉన్నాయి.

### బీఆర్‌ఎస్ సమన్వయ సమావేశాలు

రానున్న పార్లమెంట్ ఎన్నికలపైనా బీఆర్‌ఎస్ పార్టీ ఫోకస్ పెట్టింది. ఇప్పటికే బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థులను ప్రకటించింది. భువనగిరికి క్యామ మల్లేశ్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. ఈ నేపథ్యంలో గులాబీ శ్రేణులను సన్నద్ధం చేసేందుకు ప్రణాళిక రూపొందించింది. లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని గులాబీ దళపతి కేసీఆర్ సూచించారు. దీనికి మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు సమన్వయకర్తలుగా వ్యవహరించనున్నారు. భేటీకి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ముఖ్య అతిథిగా హాజరవనున్నారు.. ఈ నెలాఖరులోగా భేటీలు పూర్తి చేయనున్నారు. జిల్లాలో ఒకటి రెండు రోజుల్లో తేదీలు ప్రకటించి.. సమావేశాలు నిర్వహించనున్నారు.

### పంట నష్ట పరిహారం చెల్లించాలి



పదేండ్ల కాలంలో రైతులకు ఏనాడూ ఆపద రానివ్వలేదు. కేసీఆర్ పాలనలో అన్ని విధాలుగా అండగా నిలిచాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే రైతులకు కష్టాలు మొదలయ్యాయి. రైతులు బిక్కుబిక్కుమంటూ బతుకాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం పంట పొలాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. ఫలితంగా రైతులు అరిగోస తీస్తున్నారు. జిల్లాలో వేల ఎకరాల్లో వరి పొలాలు ఎండిపోయాయి. వారం రోజుల్లో జిల్లాలో కేసీఆర్ టూర్ ఉంటుంది. రైతులకు ధైర్యం ఇచ్చేలా పర్యటన కొనసాగుతుంది. ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి. మరోవైపు పార్లమెంట్ ఎన్నికలకు కూడా సన్నద్ధం అవుతున్నాం. అతి త్వరలోనే సమన్వయ సమావేశాలు ఉంటాయి. గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేలా సమావేశాలు నిర్వహిస్తాం.

–గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ఆలేరు

## ఎన్నికల్లో పూర్తి సహకారం అందించండి

- మాజీ ఎమ్మెల్యేలను కలిసిన కంచర్ల కృష్ణారెడ్డి

నల్లగొండ ప్రతినిధి, మార్చి26(నమస్తే తెలంగాణ) : నల్లగొండ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి జిల్లాకు చెందిన పలువురు మాజీ ఎమ్మెల్యేలను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తన అభ్యర్థిత్వానికి సహకరిచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తన సోదరుడు, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి కృష్ణారెడ్డి హైదరాబాద్‌లోని మాజీ ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి వారి వారి నివాసాల్లో కలిశారు. పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, బొల్లం మల్లయ్యయాదవ్, నోముల భగత్‌కుమార్‌ను కంచర్ల సోదరులు కలిశారు. తమను కలిసిన బీఆర్‌ఎస్ అభ్యర్థి కృష్ణారెడ్డిని మాజీ ఎమ్మెల్యేలు సన్మానిస్తూ అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా తన గెలుపు కోసం అందరూ సంపూర్ణ సహకారాలు అందించాలని ఈ సందర్భంగా కంచర్ల సోదరులు కోరారు. అందరం సమన్వయంతో ఎన్నికల్లో పనిచేసి అధినేత కేసీఆర్‌కు విజయాన్ని కానుకగా అందిద్దామని మాజీ ఎమ్మెల్యేలంతా పేర్కొన్నారు. త్వరలోనే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా నేతలు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించేందుకు సన్నాహకాలు చేస్తున్నట్లు పార్టీ నేతలు వెల్లడించారు.





నల్లగొండ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు చెబుతున్న మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భగత్ కుమార్



నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని బట్టనవానికుంటలో ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు




నల్లగొండలో ఓటరు అవగాహన ర్యాలీలో కలెక్టర్ హరిచందన, అధికారులు, విద్యార్థులు

## ప్రతి ఒక్కరూ విధిగా ఓటు వినియోగించుకోవాలి

- కలెక్టర్ దాసరి హరిచందన

రామగిరి, మార్చి 26 : ప్రతి ఒక్కరూ విధిగా ఓటు వేసి మంచి నాయకుడిని ఎన్నుకోవాలని కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. ఓటరు అవగాహనపై మంగళవారం నల్లగొండ ఎన్జీ కళాశాల నుంచి గడియారం సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో అంగన్‌వాడీ టీచర్స్, ఆర్పీలు, పంచాయతీ కార్యదర్శులు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు, పోలీసులు, వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు, వివిధ డిపార్ట్‌మెంట్‌ల అధికారులు భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యం మనదేనని, కుల, మత, లింగ బేధం లేకుండా రాజ్యాంగం అందరికీ సమానంగా ఓటు హక్కును కల్పించిందని అన్నారు. ఓటు అనే ఆయుధం ద్వారా మంచి నాయకుడిని ఎన్నుకుంటే భవిష్యత్ బాగుంటుందని చెప్పారు. ఎన్నికల సంఘం వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 85 సంవత్సరాలు నిండిన వృద్ధులతోపాటు దివ్యాంగులకు హోమ్ ఓటింగ్ సదుపాయం కల్పించిందని తెలిపారు. హోమ్ ఓటింగ్ వేయాలనుకునే ఓటర్లు ఫామ్ –12 డీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. లేదంటే సాక్ష్యం యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాములునాయక్, జడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నాగిరెడ్డి, రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు ఏసీహెచ్. పుల్లారావు, డీఎస్‌డీఓ పాల్గొన్నారు.

## సోమ సముద్రం వెలవెల

హాలియా, మార్చి26 : అనుముల మండలం పేరూరు గ్రామంలోని సోమ సముద్రం చెరువు పూర్తిగా ఎండిపోయింది. 1999 తర్వాత చెరువు వట్టిపోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. కేసీఆర్ సర్కారు మిషన్ కాకతీయ కింద ఈ చెరువుకు మరమ్మతులు చేయించారు. పూడిక తీత, చెరువు కట్ట బలోపేతం, అలుగు నిర్మాణం చేపట్టడంతో చెరువు నిండి నీటితో కళకళలాడేది. ఈ చెరువు కింద 300 ఎకరాల్లో రైతులు వరి సాగు చేసేవారు. చుట్టు పక్కల ఐదు గ్రామాల ప్రజల తాగు సాగునీటి అవసరాలను తీర్చేది. కానీ ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల్లో చుక్కనీరు లేకుండా పోయింది. దాంతో సాగు, తాగునీటి సమస్యలు తలెత్తగా మూగజీవాలు దాహార్తితో అల్లాడుతున్నాయి.



పూర్తిగా ఎండిపోయిన పేరూరు సోమ సముద్రం చెరువు

## బీజేపీ అభ్యర్థి మార్పుపై ఊహాగానాలు

- సైదిరెడ్డి స్థానంలో తెరపైకి తేరా చిన్నపరెడ్డి?

నల్లగొండ ప్రతినిధి, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : బీజేపీ నల్లగొండ లోక్‌సభ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని మారుస్తున్నారంటూ జరుగుతున్న ప్రచా రం ఆ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సైదిరెడ్డి చేరికతో పాటు ఆయనకు ఎంపీ అభ్యర్థిత్వాన్ని ఇవ్వడంపై ఆది నుంచే వ్యతిరేకత నెలకొంది. దీనిపై ఈ నెల 11న కొందరు సీనియర్ నేతలు ఆ పార్టీ ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ తివారీని కలిశారు. సైదిరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బీజేపీ నేతలు, కార్యకర్తలపై దాడులు చేయించడంతోపాటు అక్రమంగా కేసులు పెట్టించాడని తివారీకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సైదిరెడ్డి స్థానంలో మరొకరికి టికెట్‌కు ఇవ్వాలని ఆ పార్టీ సీనియర్లు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. మరోవైపు బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి ఆ పార్టీ నుంచి ఎంపీ టికెట్ ఆశించి భంగపడ్డారు. దాంతో బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశారు. అనంతరం బీజేపీ టికెట్ కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మరోసారి సైదిరెడ్డి అభ్యర్థిత్వంపై వ్యతిరేకత తెరమీదకి వచ్చింది. నల్లగొండ జిల్లా నేతలు పలువురు మంగళవారం సైదిరెడ్డి స్థానంలో చిన్నపరెడ్డికి టికెట్ ఇవ్వాలని ఆ పార్టీ పెద్దలను కోరినట్లు తెలిసింది. ఇదే విషయం ఆ పార్టీ వర్గాలతోపాటు సోషల్ మీడియాలోనూ చక్కర్లు కొట్టడం చర్చనీయాంశంగా మారింది. దాంతో బీజేపీ అభ్యర్థిగా సైదిరెడ్డి ఉంటా డా, ఆయన స్థానంలో చిన్నపరెడ్డి లేదా మరెవరినైనా ప్రకటిస్తారా? అనే గందరగోళం నెలకొంది. సైదిరెడ్డికి ఆ పార్టీలోని ఓ వర్గం నేతల నుంచి ఇప్పటికీ సహాయ నిరాకరణ కొనసాగుతున్నట్లు సమాచారం. ఇటీవల ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులను సైతం కలిసేందుకు సైదిరెడ్డి ప్రయత్నిస్తే స్పందించడం లేదని ఆ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది.

## ఎన్నికల మొదటి ర్యాండమైజేషన్ పూర్తి : కలెక్టర్



సూర్యాపేటలో పీఓ, ఏపీఓల ర్యాండమైజేషన్ చేస్తున్న కలెక్టర్ ఎస్. వెంకట్రావ్

సూర్యాపేట, మార్చి 26 : లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం పీఓ, ఏపీఓల మొదటి ర్యాండమైజేషన్‌ను పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ తెలిపారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పీఓ, ఏపీఓలను విభజించామని, ఎన్నికల నిర్వహణ, విధివిధానాలపై మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం 5,664 మంది సిబ్బందిని ఎంపిక చేశామని, ర్యాండమైజేషన్ మరో రెండు దఫాలు నిర్వహిస్తామని చెప్పారు. పీఓలు, ఏపీఓలు తప్పకుండా శిక్షణ కార్యక్రమాలకు హాజరుకావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ అప్పారావు, శ్రీనివాస్‌రాజు, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

### నల్లగొండలో 9,490 మంది సిబ్బంది ర్యాండమైజేషన్

నల్లగొండ : కలెక్టరేట్‌లో మంగళవారం నల్లగొండ పోలింగ్ సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరిచందన నిర్వహించారు. జిల్లాలో ఆరు నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల విధులు నిర్వర్తించే పీఓ, ఏపీఓ, ఓపీఓ ర్యాండమైజేషన్‌ను పూర్తి చేశారు. రిజర్వ్ సిబ్బందిని కలుపుకొని జిల్లా పరిధిలో మొత్తం 9,490 మంది పోలింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ జరిపారు. వీరిలో 2,368 పీఓలు, 2,377 మంది ఏపీఓలు, 4,745 మంది ఓపీఓలు ఉన్నారు. ఎంపిక చేసిన వివిధ కేంద్రాల్లో మాస్టర్ ట్రైనర్స్ పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరుగతులు నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రియలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా ఇన్ఫర్మేటిక్ అధికారి గణపతిరావు, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్డీఏ నాగిరెడ్డి, డీఈఓ భిక్షపతి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో గోస పడుతున్న రైతన్నలు

- రాష్ట్రంలో 20లక్షల ఎకరాల్లో పంట నష్టం
- ఎకరానికి రూ. 25వేల నష్ట పరిహారం చెల్లించాలి
- సాగర్ జలాశయంలో డెడ్ స్టోరేజీలో ఉన్నా సాగు నీరు అందించిన ఘనత కేసీఆర్‌ది
- కాంగ్రెస్ పాలన 100 రోజులైనా ఎక్కడి సమస్యలు అక్కడే
- ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్
- నేరేడుచర్లలో నీళ్లులేక ఎండిన వరి పంటల పరిశీలన

నేరేడుచర్ల, మార్చి 26 : పది సంవత్సరాలు పండుగ వాతావరణంలో వ్యవసాయం చేసిన రైతులు ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో సాగు నీరు లేక అరగోస పడుతున్నారని రాజ్యసభ సభ్యుడు, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని బట్టనవానికుంటలో మంగళవారం నీళ్లు లేక ఎండిపోయిన రైతు దొండపాటి లచ్చిరెడ్డికి చెందిన వరి పంటను స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల పాలన ముగిసినప్పటికీ ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. సాగర్ నీరు వస్తుందనే నమ్మకంతో బోర్లు, బావులు కింద రైతులు ధైర్యంగా వరి సాగు చేశారని, రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించి నీటిని విడుదల చేయలేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 20లక్షల ఎకరాల్లో నీళ్లు లేక పంటలు ఎండిపోయాయని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో కొనసాగిన రైతు ఆత్మహత్యలు తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వంలో కొనసాగుతున్నాయని, రాష్ట్రంలో ఇప్పటివరకు 180 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నాగార్జున సాగర్ జలాశయంలో ప్రస్తుతం 513 అడుగుల నీరు ఉందని, బీఆర్‌ఎస్ సర్కారులో 505 అడుగుల డెడ్ స్టోరేజీలోనూ నీటిని విడుదల చేసి సాగు, తాగునీటిని అందించి రైతులు, ప్రజలను ఆదుకుందని గుర్తు చేశారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఇంటింటికీ తాగు నీరు అందించే మిషన్ భగీరథ పథకం కాంగ్రెస్ పాలనలో మూలకు పడిందన్నారు. తుంగభద్ర, కర్ణాటక, శ్రీశైలం నుంచి కనీసం 10 టీఎంసీల నీటిని తీసుకొచ్చి సాగు, తాగు నీటిని విడుదల చేయాలని కోరుతున్నా రేవంత్ సర్కారు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. మనకంటే కింది ప్రాంతమైన ఖమ్మం జిల్లాలోని తిరుమలాయిపాలెం వరకు సాగర్ నీటిని అక్కడి మంత్రులు తీసుకుపోతే, హుజూర్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్ రెడ్డి కనీసం పట్టించుకోలేదని అన్నారు. మనకు నీటిని విడుదల చేయకపోవడం వల్లే నేడు నల్లగొండ, సూర్యాపేట జిల్లాలు ఎడారిగా మారుతున్నాయని తెలిపారు. ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడం వల్లనే నేడు నీరు లేక పంటలు ఎండి రైతన్నలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజా సమస్యలను పరిష్కరించడమే తమ పార్టీ ధ్యేయమని తెలిపారు.

నీళ్లు లేక పంటలు నష్టపోయిన రైతులను ఎకరానికి రూ. 25వేల చొప్పున ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విపత్తులతో పంట నష్టయిన రైతులకు బీఆర్‌ఎస్ సర్కారులో ఎకరానికి రూ. 10వేల చొప్పున చెల్లించినట్లు చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని, రైతు బంధు రూ. 15వేలు ఇస్తామని గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత దాని ఊసే ఎత్తడం లేదన్నారు. కనీసం పూర్తిస్థాయిలో రైతుబంధు కూడా విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో గ్రామాల్లోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించగా, యాసంగి ధాన్యం చేతికొస్తున్నా ఇప్పటికీ కాంగ్రెస్ సర్కారు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ఆయన వెంట డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు నాగండ్ల శ్రీధర్, కడియం వెంకట్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబు, మాజీ ఎంపీపీ చెన్నబోయిన సైదులు, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుపులేటి నర్సింహారావు, మండల ప్రధాన కార్యదర్శి ఎల్లబోయిన లింగయ్య, ఉపాధ్యక్షుడు సుదర్శన్, నాయకులు పిచ్చిరెడ్డి, జెట్టి వెంకన్న, నాగార్జున, సుందరయ్య, వినాయకరావు, భరత్, నాగరాజు, శ్రీను, వెంకన్న, హుస్సేన్ ఉన్నారు.



గుట్టలో కొంగు కప్పుకొని వెళ్తున్న మహిళ

## ఎండ@40.8 డిగ్రీలు

- మార్చిలోనే భగ్గుమంటున్న సూర్యుడు

యాదాద్రి భువనగిరి, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఎండలు దారెత్తిస్తున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. పగలు, రాత్రి అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 9గంటలకే భానుగు భగ్గమంటున్నాడు. దాంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి నుంచి బయటకు రావడానికే జంకుతున్నారు. మంగళవారం 40.8 డిగ్రీల గరిష్ఠ, 27.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. మార్చిలోనే ఇలా ఉంటే మరో రెండు నెలలు పరిస్థితి ఏంటని జనం బెంబేలెత్తుతున్నారు. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఎండల నుంచి రక్షణ పొందేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.



వేసవి తాపానికి డ్రమ్ములో నీళ్లు తాగుతున్న కోతి

## చి‘వరి’ ప్రయత్నం

- పంటకు ట్యాంకర్ ద్వారా నీరు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 26 : జిల్లాలో భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటుతున్నాయి. చెరువులు, బావుల్లో నీరు లేక తాగు, సాగునీటికి కష్టంగా మారింది. యాసంగిలో వేసిన వరి పంటలు చేతికందే దశలో నీళ్లు లేక ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు పంటలను కాపాడుకునే భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. భువనగిరి మండలంలోని గౌస్‌నగర్ గ్రామంలో చంద్ర మల్లయ్య అనే రైతు 3ఎకరాల్లో బోర్ల కింద వరి సాగు చేశాడు. వేసవి సమీపిస్తున్నా కొద్దీ భూగర్భ జలాలు తగ్గడంతో పంటకు నీరు అందడం లేదు. దాంతో ట్యాంకర్ ద్వారా రోజుకు రూ.2వేలు వెచ్చించి పొలానికి నీళ్లు పోయించుకుంటున్నాడు. పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఉందని చంద్ర మల్లయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



వరిపంటకు ట్యాంకర్ ద్వారా నీళ్లు పెడుతున్న రైతు మల్లయ్య